# జెలసీ

నేనూ చలపతిరావూ చాలా స్నేహితులం. బి.ఏ. చదువుతో వుండగా ఒక సాయంత్రం అరాత్తుగా అతనికి వితంతువులమీద ప్రేమ కలిగి, వాళ్ళ కష్టాలమీద కరుణ పుట్టింది. వితంతువును తప్ప పెళ్ళి చేసికోనని పట్టుపట్టాడు. మేనమామ కూతుర్నిస్తామని వస్తే "ముందు వితంతువును కానిమ్మ' అని చీవాట్లు తిన్నాడు.

యల్. టి. చదువుతో, మళ్లీ మేమిద్దరమూ, ఒక గదిలోనే వున్నాము. ఆ గదివున్న ఇంటి ఆయన కుమారస్వామి. ఆయన భార్య నవ్వులతో మాకు చదువుసాగక కాలేజీలో ప్రతి రోజూ చీవాట్లు. ఆమె దర్శనం యెన్నడో అయ్యేది. ఆ నాడింక ఆమె తప్ప యింక దేనికి కళ్ళు అంధా లయ్యేవి. చేసుకుంటే అల్లాంటి పిల్లని తప్ప చేసుకోన నన్నాడు చలపతిరావు. అటువంటి పిల్ల కావాలి, ఆమె వితంతువు ఐవుండాలి, వాడికి పెళ్ళి కావాలంటే. అది చాలా అసంభవంగా తోచింది; ఆ కుమారస్వామిని హత్యచేస్తే తప్ప. కాని ఆమె తనని వలిచి వాళ్ళో రాలాలని మూడో షరతు పెట్టాడు చలపతి. భర్త హంతకుణ్ని మోహించినట్లు హిందూదేశ చరిత్రలో నిదర్శనాలు కనపడ్డాయి కాని అవేమీ ఆంధ్రదేశానికి చెందినట్లు లేవు.

అందులో ఆ పిల్ల పీడివంక కన్నెత్తి చూడనన్నా చూడటం లేదు.

నాలుగేళ్ళు అయింది. కుమారస్వామి భార్యాని చలపతిరావు పెళ్ళి చేసికున్నాడు. అసంభవ మనుకున్న మూడు షరతులూ నెరవేరాయని నాకు వ్రాశాడు చలపతిరావు. కుమారస్వామి పాతభార్యయున్నూ, చలపతిరావు కొత్త భార్యయూ ఐయైన రాజమ్మ చక్కదనాన్ని తలుచుకుని, పొయ్యిదగ్గర చారు తిరగమోత పెట్టుతున్న నా భార్య వంకరదనాన్ని చూసుకుని, ఒక వారం బాధపడ్డాను. తరువాత మరచిపొయ్యాను.

మూడేళ్ళయింది. బెజవాడ వెళ్ళటం తటస్థించింది నాకు. మూడు రోజులు చలపతిరావు యింట్లోనే బసచేసి, ఆనాటి రాత్రి మెయిలికి పోతానని శలవు తీసికొని బయలుదేరాను. మెయిలు తప్పింది. స్టేషనులో పడుకుందామంటే చలి, తిరిగి వచ్చి ఆ దంపతుల్ని లేపడ మెందుకని వాళ్ళ యింటిముందున్న చిన్న గేటు దూకి, వరండాలో నా మామూలు మంచము వాల్చుకుని, శైలు సంచిలో దుప్పటితీసి కప్పుకొని, సంచి తలక్రింద బెట్టుకొని పడుకున్నాను. లోపల గదిలోనించి కంఠాలు వినబడుతున్నాయి. సంభాషణ అంత నిష్ఠురంగా జరుగుతుందని తెలిసివుంటే ముందే నేనున్న సంగతి వాళ్ళకి తెలిసేట్టు చేసివుందును. కొంతసేపు విన్నతరవాత నేనున్న సంగతి తెలియ చెయ్యడం దుష్కరమయ్యింది. పోదామంటే చలి.

"మరి అప్పుడు నన్ను బైటి గదిలో చూచేదానివి కదా"—

"ఎప్పుడు?"

"అదే (కష్టంగా) ఆ కుమారస్వామితో వుండేప్పుడు - అప్పుడు.........నువ్వు నన్ను చూశావుకదా, నామీద యిష్టం కలుగ లేదూ?"

"ఎందుకు కలుగుతుంది? మీరెవరో!"

"అంతేనా! మరి యిప్పడో?"

"అడుగుతారా?"

"అప్పుడు ప్రేమ రానిది యిప్పుడు మాత్రం వొస్తుందా యేమిటి!"

"ప్రేమించదండి, మిమ్మల్నెందుకు పెళ్ళిచేసికుంటాను?"

"అతను....ఆ కుమారస్వామి — బతికివున్నప్పుడే, నిన్ను వాతో రమ్మంటే వచ్చేదానివా?"

"తప్పుకాదూ?"

"మరి యింక నామీద ప్రేమ యేమిటి?"

జవాబు లేదు.

"పోనీ, అత న్నెక్కువ ప్రేమించావా, నన్నా!"

"మిమ్మల్నే, సందేహమా?"

"అతను నా అంత ప్రేమగా వుండేవాడా, నీ మీద?"

"ఆఁ."

"కాని అప్పుడప్పుడు కోప్పడేవాడే?"

"ఆ కోపము యేముందిలెండి! — హాస్యానికి."

(నొచ్చుకున్న కంఠంతో) "ఐతే అతను బతికి వుంటేనే బాగుండు ననుకుంటున్నావా?"

"ఛా."

"ఏం?"

"అప్పుడు మీరెట్లా తెలిసేవారు?"

"నేను తెలియక పోతేనేం? అతనితో బాగానే వుందిగా?"

"కాని, మీ ప్రేమో?"

"అంటే ప్రేమలు నీకు మారుతో వుండాలన్న మాట. నేను చస్తే బాగుంటుందా యిప్పుడు?"

"పోండీ మరీని."

"చెప్పు."

మాటాడలేదు ఆమె.

"చెప్పమంటే. నేను చావాలనే వుంది. అందుకనే మాటాడవు——చెప్పవేం?"

"పొండి. ఆయనతో యెట్లా వుంటే మీకేమండీ? ప్రతి రాత్రి ఆయన ప్రస్తావన తెచ్చి చంపుతారు. ఆయ నేమన్నా దెయ్యమై పట్టారా యేమిటి మిమ్మల్ని? ఇంత గాఢంగా ప్రేమిస్తున్నానే చాలదూ?"

మాటలు లేవు. ఏడుస్తో వూపిరి పీలుస్తున్న చప్పుడు.

"చూడు. ఇంకెప్పుడు ఆ సంగతి యెత్తనుగాని ఇది వొక్కటి చెప్పు చాలు. నిజం చెప్పాలి. మొదటి రోజు శోభనం గదిలో మొదట అత నేం చేశాడు?"

"ఏమండీ? ఏం చేస్తారేం? మీకు తెలియదా? మీరేం చేశారు?"

"నేనా? నా మొహం, నా కా అదృష్టం కూడానూ? చెప్పు మరి?"

"ఎందుకండి అదంతా యిప్పుడు? ఎప్పుడో మరిచి పోయానూ."

"మరిచిపోలేదు. జ్ఞాపకం తెచ్చుకో. నిజం చెప్పు అబద్ధం చెప్పావా? (గొంతు మార్చి) ఇదొక్కటి చెప్పు. నిద్ర పోతాను. ఏం చేశాడు? నువ్వు యిష్టపడ్డావా? చెప్పుదూ? మీ ఇంటోనేగా - కుంచ వరంలో - ఆ యింటి పడమర గదిలో - జ్ఞాపకం వస్తుంది కాదూ?"

"ఏం లేదు. ఏముంది? నే సిగ్గుపడుతో నుంచున్నాను."

"అప్పటికి నీకు తెలుసా?"

"ఏమిటీ?"

"అబ్బా, నన్ను చంపకు, ఇదే-ఇదంతా."

"నిజం నాకేమి తేలీదు, అప్పటికి."

"ఆ, తెలీకుండా వుంటుందా యేం?"

"ఎట్లా తెలుస్తుంది? నిజం."

"అప్పుడే నన్న మాట - పాపం, నిన్ను ఏం తెలీనిదాన్ని - వొంటరిగా—"

(నవ్వు..................)

"ఎందుకు నవ్వుతావు?"

"ఏం లేదు."

"ఏం లేదూ? చెపుతావా చెప్పవా?"

"ఏం లేదండీ? వొంటరిగా - ఏమిటి? మరి భార్యనై నాక—"

"అవును, ఏం చేశాడు?"

"అబ్బా? నాకు తెలీదు, నిద్ర వొస్తోంది?"

"చెప్పాలి, చెప్పి తీరాలీ, నిన్ను నిద్రపోనీను యీ రాత్రి, చెప్పిందాకా?"

"ఆయన లేచి వొచ్చి, చెయ్యి పట్టుకుని—"

"వొద్దు—వొద్దు....ఆ కొత్తదనం, ఆ సిగ్గు అదంతా హాయిగా వా డనుభవించాడు — అంతా పాతై నీ కంతా తెలిసి మామూలై పోయిన తరవాత - యిప్పుడు - వాడు అన్ని తాకి వొదిలేసి మిగిలినవి, ఇదే నా బతుకా? ఛీ. ఛీ. వెధవని—

"నేను ప్రేమిస్తున్నానుగా?"

"అవునులే, ప్రేమించడమూ, అవీ, అన్నీ, అతను నేర్పాడు నీకు. ఆ చూపులు. ఆ నవ్వు, అన్నీ అతనికోసం నేర్చుకొని, నా మీద చూపుతున్నావు. నేను ముద్దు పెట్టుకుంటే, అతను పెట్టుకున్న ముద్దులతో పోల్చుకుంటావు. అవి మొదటివి. కొత్తవి. అవే బాగుండి ఉంటాయి నీకు. అవునా?"

"ఏం చేయమంటారు నన్ను?"

"ఒప్పుకున్నావుగదా నిజమని! ఆహా! నీ ప్రేమంతా అతనిదే. అతన్ని తలచుకుంటో నా మీద చూపుతావు. చీకట్లో అతనినే అనుకొని తృప్తిపడతావు. అవునా?"

"ఛీ?"

"అవునులే నాకు తెలుసు?"

"కాదండీ"

"నోరుముయ్యి మాట్లాడకు. కొందరి కులటలకి బతికివున్న పరాయి వాళ్ళమీద ప్రేమ. నీకు చచ్చిన పరాయి వాడిమీద."

"నిజంగా ఆయన జ్ఞాపకమే లేరండీ. మీరు తప్ప యీ హృదయంలో యెవరూ లేరు."

"నిజమా? నిజమా? ఎట్లానమ్మను? మూడేళ్ళల్లోనే మరచి పోతావా? అబద్ధము? అయితే మరి నేను చచ్చినా అంతే?"

"ఛా."

"ఛా, ఏమిటి? మరి అతన్ని కూడా ప్రేమించావా? చచ్చిన ఆరు నెలలో నన్ను పెళ్లాడావా? అంతేగా? నేను చస్తే,

"మళ్లీ!"

"ఊరుకోండీ."

"మాట్లాడవేం?"

"నాకు తెలీదు. నిద్రవొస్తోంది. పడుకోపీండి."

"అదిఒంక, చెప్పుముందు - నిజంగా నా మీద ప్రేమేనా?"

"మళ్లీ మొదలా?"

"వాడు - ఆ కుమారస్వామి."

"పడుకోండీ - ఏమిటండీ, ప్రతి రాత్రీ యీ గోల? మీకేమన్నా మతి చెడిందా? ఆయన ధర్మమా అంటో మీ స్నేహితుడు ఈ మూడు రోజులు వున్నాడు. ఆయన ఉన్నాడని ఊరుకున్నారు. బతికిపోయినాను. రైలుకు వెళ్లాడో లేదో మొదలుపెట్టారు."

"అత నింకా ఉండాలనే ఉందన్న మాట నీకు?"

"ఆ!"

"అప్పుడే కన్నీళా వన్న మాట."

"ఛీ, నోరు ముయ్యండీ"

"అవును, నేను బతికివుండగానే తరవాత భర్తను సిద్ధం చేసుకుంటున్నా వన్న మాట."

"మీకు మతిపోయింది."

"మరి కుమారస్వామి బతికివుండగానే, నన్ను చూచుకోలా? అట్లానే!"

"నేను మాటాడను."

"ఎందుకు మాటాడుతావు? నిజం చెప్పు - వాడిమీద కన్ను వెయ్యలా? నాకు తెలిపిందిలే. ఎన్నడూ లేనిది, మళ్లీ మంగళవారం వస్తా నన్నాడు. ఓసి దొంగ - ఓసీ - ముండా."

"ఛీ, ఊరుకొండీ - మీకు పిచ్చి మితిమీరి పోతోంది మరిన్నీ."

"అవును, పిచ్చే - నీకు హృదయం లేదు. నిన్ను చంపినా పాపంలేదు. నీవంటి వాళ్ళు బ్రతికి వుండకూడదసలు - రాక్షసివి. మొగుడు బతికి వుండగానే మొగుణ్ని చూచుకోడమా? రెండో సారి.

ఇంక యేముంది? నన్ను చంపేట్టున్నావే! మాటాడవేం? పాపం, ఆ నిర్భాగ్యుణ్ని, ఆ అమాయకుణ్ని కుమారస్వామిని చంపావా, నా కోసం? ఆ చంపే వుంటావు. ఎంత ఘాతుకరాలివే!"

ఏడుస్తోంది ఆమె.

"ప్రతి మొగాడితోను — యిట్టా నన్నుకట్టి చంపకపోతే పొమ్మనరాదూ, పోతాను.!"

"పోవాలనే చూస్తున్నావూ? వాడిదగ్గరకేనా? పో, పో, పో, ముండ."

రెండు దెబ్బల చప్పుడు, ఏడుపు. గడియ తీస్తున్నారు. అమాంతం పక్కమీద వాణ్ని లేచి చిన్న గేటు దూకి చిన్న వీథుల్లో పడ్డాను. ఒక్క పరుగున రైలుస్టేషను చేరుకున్నాను.

ఎంత నాగరికత, దయ, రెస్పెక్టు గలిగిన మనుష్యులూ, భార్యల దగ్గిర ఇట్లా అవుతారు గావును. చలపతిరావు అంత "నైస్ మాన్" అట్లా మాట్లాడడే! నిష్కారణంగా ఈ గదులలో ఎంతెంత ఘోర కృత్యాలు జరుగుతాయో! కోటూ తల గుడ్డ ఇంటికి రాగానే తీసేసినట్టే మానర్సు, సెన్సు, రెస్పెక్టు, అన్నీ తీసి చిలక్కొయ్యకి తగిలిస్తారు. భార్యేగా! పగ లంతా స్టేజిమీదవలెనే వేషంలో ఉంటారు. ఆ తెర వెనక నిజస్వరూపంతో తయారవుతారు, ఈ పెద్ద మనుష్యు లందరూ. ఏ కోపమో, జెలసీ, కామము, ఇట్లాంటివి పట్టుకొని ఊపేప్పటికి మనుష్యుల మనుకొని ప్రవర్తించేవారందరూ, కుక్కలు, కోతులు, పెద్ద పులులు, ఎలుగుబంట్లుగా మారుతారు - ముఖ్యంగా తమ మీద ఆధారపడి, ఇతరమైన దిక్కులేని భార్యలముందు, పిల్లల ముందూ. ఆ మాట అంటె పట్టరాని కోపం.

---